ఎదురుచూపులు ఫలించాయి..

- ఎట్టకేలకు నామినేటెడ్ పదవుల పంపకాలు
- జిల్లాలో నలుగురికి చోటు
- రెండోసారి రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రకాష్‌నాయుడు
- కొత్తగా గుడుపూటి నారాయణస్వామి, స్వప్న, హరికృష్ణ రావుకు అవకాశం


ప్రకాష్‌నాయుడు


నారాయణస్వామి


స్వప్న


హరికృష్ణరావు

అనంతపురం ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆశావహుల ఎదురుచూపులు ఫలించాయి. ఎట్టకేలకు నామినేటెడ్ పదవుల పంపకాలు చేశారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 31 మందికి చైర్మన్ పదవుల హోదా కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. జిల్లాలో నలుగురికి అవకాశం కల్పించారు. ఇందులో ముగ్గురికి తొలిసారిగా చైర్మన్ హోదా దక్కింది. టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ.. పార్టీలో అనేక పదవుల్లో పనిచేసిన చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాష్‌నాయుడుకు రెండోసారి మాంసాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా అవకాశం కల్పించారు. పార్టీ విధేయతకు పట్టం కట్టారనేందుకు చంద్రదండు ప్రకాష్‌నాయుడు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. యువ నాయకుడిగా అనేక కార్యక్రమాలు చేపడుతూ.. కష్టాల్లోనూ.. నష్టాల్లోనూ పార్టీ వెన్నంటే నడిచారు. చంద్రబాబునాయుడుకు రక్షణ కవచంగా చంద్రదండును స్థాపించారు. చంద్రబాబు ఏ కార్యక్రమంలో పాల్గొన్నా... చంద్రదండు అక్కడ వాలిపోయి... ఆయనకు బలమైన వలంటీర్ వ్యవస్థగా పనిచేస్తోంది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకాష్‌నాయుడుకు మాంసాభివృద్ధి చైర్మన్‌గా పదవి కట్టబెట్టారు. తిరిగి 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు అదే పదవి ఇవ్వడం గమనార్హం.

కొత్తగా ముగ్గురికి అవకాశం

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రాయలసీమ జోన్-5 ఇన్‌చార్జిగా పనిచేస్తున్న రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం వడ్డిపల్లికి చెందిన గుడుపూటి నారాయణస్వామిని ఏపీ వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. విద్యార్థి, తెలుగు యువత నాయకుడిగా నారాయణస్వామి అనేక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా... పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేశారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వలంటీర్లకు నాయకత్వం వహించారు. లోకేశ్ వెన్నంటే నడిచారు. తెలుగుదేశం పార్టీలో చురుకైన మహిళా నాయకురాలిగా, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న అనంతపురం అర్బన్‌కు చెందిన స్వప్నకు ఏపీ వీరశైవ లింగాయత్, లింగ బలిజల అభివృద్ధి, సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్‌పర్సన్‌గా నియమించారు. దశాబ్దన్నరకిపైగా ఆమె పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఏపీ అరికటిక, కటిక కుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తున్న తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండల కేంద్రానికి చెందిన హనుమంత కరి హరికృష్ణరావును ఏపీ అరికటిక, కటిక, ఆర్ సూర్యవంశీ సంక్షేమ, అభివృద్ధి సంఘం చైర్మన్‌గా నియమించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హరికృష్ణారావు తండ్రి లక్ష్మణ్ రావు కీలకంగా పనిచేశారు. హరికృష్ణ వదిన పెద్దవడుగూరు టీడీపీ మండల అధ్యక్షురాలిగా పనిచేశారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న హరికృష్ణరావుకు చైర్మన్ హోదా కల్పించారు.

అయోమయం..!

జిల్లాకు ఫసల్ బీమా రూ.77.49 కోట్లు విడుదల
ఆధార్‌తో బ్యాంక్ ఖాతా లింక్ కాలేదంటూ సమాచారం
ఎప్పటిలోగా జమ అవుతుందో తెలియక రైతుల ఆందోళన

అనంతపురం అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులకు ఎప్పటిలోగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పరిహారం అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల 11న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజస్థాన్‌లోని జుంజును నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా సొమ్మును విడుదల చేశారు. దీంతో తమకు ఫసల్ బీమా సొమ్ము జమ అవుతుందని జిల్లా రైతులు ఆశపడ్డారు. అయితే ఇప్పటి దాకా ఏ ఒక్క రైతుకు సొమ్ము జమ కాలేదు. జిల్లాలోని అనేక మంది రైతుల ఫోన్లకు 2024 ఫసల్ బీమా కింద జమ అయ్యే డబ్బుల వివరాలతో సంక్షిప్త సమాచారం మాత్రమే పంపారు. అందులో మీ ఆధార్, బ్యాంక్ ఖాతా నెంబర్‌తో లింక్ కాకపోవడంతో ఫసల్ బీమా సొమ్ము జమ కాలేదంటూ సమాచారం వచ్చింది. అన్నదాత సుఖీభవ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ అయినప్పుడు ఫసల్ బీమా ఎందుకు జమ కాదంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు సైతం సరైన సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నారు.

జిల్లాకు రూ.77.49 కోట్లు విడుదల

ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా 2023 ఖరీఫ్, రబీ, 2024 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి జిల్లాకు రూ.77.49 కోట్లను విడుదల చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులకు ఫసల్ బీమా విడు దలకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం సాయంత్రానికి కూడా కమిషనరేట్ ఉన్నతాధికారులు పంపలేదు. సాయంత్రం 5.30 గంటలకు జిల్లాకు పంటల వారిగా ఎంత ఫసల్ బీమా సొమ్ము విడుదలైందన్న వివరాలు మాత్రమే పంపారు. మరో పది రోజుల్లోగా ఫసల్ బీమా సొమ్ము జమ అయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులు ప్రకటన విడుదల చేశారు. అయితే జిల్లాలో రైతుల వారిగా ఏఏ పంటలకు ఎంత విస్తీర్ణానికి ఎంత ఫసల్ బీమా విడుదలైందన్న వివరాలు లేకపోవడం గమనార్హం. దిగుబడి ఆధారంగా ఫ్యూచర్ జనరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఫసల్ బీమాను వర్తింపజేశారు. 2023 రబీ సీజన్ వరకు ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేలా నిర్ణయించారు. అప్పట్లో ఈ విధానాన్ని గత ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదన్న కారణంతో 2024 రబీ సీజన్ నుంచి రైతుల ద్వారా ప్రీమియం చెల్లించేలా నిర్ణయించారు.

యాడికి వద్ద వర్షాభావంతో ఎండిన పప్పుశనగ పంట (ఫైల్)



ఫసల్ బీమా విడుదల ఇలా..

2023 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.1,59,73,932లు, 2023 ఖరీఫ్‌లో ఎండు మిరప రైతుకు రూ.1,33,72,251, 2023 ఖరీఫ్‌లో జొన్న రైతులకు రూ.45,70,041లు విడుదలైంది. 2023 ఖరీఫ్‌లో మూడు పంటలకు మొత్తం రూ.3,39,16,224లు విడుదలైంది. 2023 రబీ సీజన్‌లో పప్పుశనగ రైతులకు రూ.14,97,59,866లు, వేరుశనగ రైతులకు రూ.29,19,301లు విడుదలైంది. 2023 రబీలో రెండు పంటలకు మొత్తం రూ.15,26,79,168లు విడుదల చేశారు. 2024 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.56,55,43,578లు, జొన్న రైతులకు రూ.2,28,41,233లు విడుదలైంది.

డబ్బులు జమ కాలేదు

ఫసల్ బీమా డబ్బులు ఇంకా జమ కాలేదు. పోయిన సంవత్సరం 10 ఎకరాల్లో కంది పంట వేశాం. వానలు సరిగా రాకపోవడంతో దిగుబడి రాలేదు. నా సెల్ ఫోన్‌కు 2024 ఫసల్ బీమా డబ్బులు రూ.7457లు వచ్చాయని, అయితే ఆధార్‌కు బ్యాంక్ ఖాతాను లింక్ కాలేదని మెసేజ్ వచ్చింది. ఎప్పుడు డబ్బులు జమ అవుతాయో అర్థం కావడం లేదు.



- మహిళా రైతు లక్ష్మీనారాయణమ్మ, రామరాజుపల్లి, పామిడి మండలం

మెసేజ్ వచ్చింది



గత ఏడాది నాలుగు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. పంట పూత సమయంలో మేఘావృతం కావడంతో పూత డ్రాప్‌అవుట్ అయ్యింది. అలాగే సకాలంలో వర్షాలు పడకపోవడంతో దిగుబడి రాకపోవడంతో నష్టపోయా. రూ.14958లు ఆధార్‌కు బ్యాంక్ ఖాతా లింక్ లేకపోవడంతో జమ కాలేదని సెల్ ఫోన్‌కు మెజేస్ వచ్చింది. జిల్లాలోని అనేక మందికి ఇలాంటి సమాచారమే వచ్చింది. అన్నదాత సుఖీభవ డబ్బులు జమైనప్పుడు ఫసల్ బీమా ఎందుకు జమ కావడం లేదో అర్థం కావడం లేదు. దీనిపై వ్యవసాయ అధికారుల వద్ద సరైన సమాచారం లేదు. రైతుల వారిగా జాబితాను విడుదల చేసి, ఫసల్ బీమా ఎందుకు జమ కాలేదో సరైన సమాధానం చెబితే బాగుంటుంది.

- రైతు వలి, మర్తాడు, గార్లదిన్నె మండలం



శరణు.. శరణు.. గురురాయా..

అనంతపురం టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్తరారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి బృందావనానికి వివిధ అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. రథంలో స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి, పురవీధుల్లో ఊరేగించారు.

అలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

వేదవతి హగరి ఉరకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి హగరి నది

కణేకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలకు వేదవతి హగరి నదికి వరద పెరుగుతోంది. దీంతో నది ఉరకలేస్తోంది. మండలంలో 10 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కణేకల్లు-ఉరవకొండ మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రెవెన్యూ పోలీసు అధికారులు వరద ఉధృతిని ప్రజలకు తెలియజేస్తూ నది వైపు వెళ్లకుండా జాగ్రత్తలు చెబుతున్నారు.

ఆగని వాన

పలు మండలాల్లో వర్షం
ఉప్పొంగిన వాగులు, వంకలు
ఉద్యాన పంటలకు నష్టం

(వివరాలు 6లో..)

భూచోళ్లు..!

భూ పరిహారం కోసం మాయగాళ్ల ఎత్తులు

- టేకులోడు సెజ్‌లో అన్‌సెటిల్డ్ భూములపై కన్ను
- లేని వారసులను సృష్టించే ప్రయత్నం
- 50 ఎకరాల వరకు అపరిష్కృత భూములు
- దళారులకు ఇద్దరు అధికారుల సహకారం

టేకులోడు వద్ద పరిశ్రమలకు తీసుకుంటున్న భూములు



చిలమత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారాన్ని మాయతో కాజేసేందుకు కొన్ని గుంట నక్కలు కాచుకుకూర్చున్నాయి. ఈక్రమంలోనే అన్‌సెటిల్డ్ భూములపై కన్ను వేశాయి. లేని వారసులను పుట్టించి పరిహారాన్ని ఫలహారం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. మండలంలోని టేకులోడు రెవెన్యూ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ జరుగుతోంది. రైతులు సాగు చేసుకుంటున్న 600 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు వారికి పరిహారం అందించి, భూసేకరణ ప్రారంభించింది. అయితే ఈ 600 ఎకరాల్లో 24 మంది రైతులకు సంబంధించి సుమారు 50 ఎకరాలు చాలా కాలంగా అన్‌సెటిల్డ్‌గా (అపరిష్కృతంగా) ఉండిపోయింది.

అన్‌సెటిల్డ్ భూములపైనే కన్ను

2014-2019 మధ్య కాలంలో టేకులోడు రెవెన్యూ గ్రామంలో టి-హబ్ కోసం 200 ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఆ సమయంలో అన్‌సెటిల్డ్ భూముల విషయంలో అవకతవకలు

(మిగతా 6లో...)

ఓ పట్టాన తెగదే..!

దశాబ్దాలుగా సాగులో ఉన్నా లభించని పట్టా
1951లో సొసైటీ కింద 284.71ఎకరాలకు పట్టా
ప్రభుత్వ పథకాలు అందని 300 మంది రైతులు
అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్య



వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని కోరుతున్న దొడఘట్ట నిరుపేద రైతులు

రొద్దం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాల కోసం దొడఘట్ట గ్రామ రైతులు ఎదురు చూస్తున్నారు. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న కాలంలో కల్లుగీత కార్మికులకు దొడఘట్ట ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద 284.71ఎకరాల భూమికి పట్టాలిచ్చారు. సర్వేనంబరు 259నుంచి 514వరకు ఈ భూములు ఉన్నాయి. వీటి అనుభవం కోసం 30మంది రైతులతో ఓ సొసైటీని ఏర్పాటు చేసి, అధ్యక్షులుగా సంజీవప్పను నియమించారు. పట్టాలు కూడా సొసైటీ పేరుతోనే ఉన్నాయి. తర్వాత కాలంలో రైతులు ఉలవ, సజ్జ, కొర్ర, వేరుశనగ, కంది, పత్తి,

(మిగతా 6వ పేజీలో..)

ఎరుపెక్కిన అనంత

- అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ
- అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించండి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ (7లో..)







ర్యాలీగా సాగుతున్న సీపీఐ శ్రేణులు

టీడీపీతోనే బలహీన వర్గాల సంక్షేమం...!

- జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఇతర నేతలు

అనంతపురం క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణుల కోసం సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచినందుకు మంగళవారం త్రివేణి థియేటర్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాలాభిషేకం చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ గతంలో నాయీ బ్రాహ్మణుల కష్టాలు విన్న చంద్రబాబు ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని ఆయన అమలుచేశారన్నారు. నాయీబ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధి కోసం ఫెడరేషన్ ద్వారా రుణాలు పెద్ద ఎత్తున అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొండన్న, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేష్, నరసింహమూర్తి, ఇతర నాయకులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సంగా తేజశ్విని, నారాయణస్వామి, నెట్టెం బాలకృష్ణ, సంగా పవన్, సూరి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నెట్టికంటి స్వామికి వెండిరథ ప్రాకారోత్సవం

బలవంతం వద్దు

- స్వచ్ఛందంగా వచ్చిన వారే మార్గదర్శులు
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల దత్తతకు సంబంధించి ఎవరినీ బలవంతం చేయవద్దని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. మంగళవారం జేసీ క్యాంపు ఆఫీస్ నుంచి ఉపాధి హామీ పథకం, పీ4 సర్వే, పంచాయతీ, మున్సిపల్ సెక్టార్, గ్రామ/వార్డు సచివాలయం ద్వారా చేపడుతున్నఅంశాలపై ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల విషయంలో స్వచ్ఛందంగా వచ్చిన వారే మార్గదర్శులన్నారు. బంగారు కుటుంబాలకు సంబంధించి సర్వే పూర్తి చేయాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో బంగారు కుటుంబాల మార్గదర్శులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలు పెంచడానికి నియోజకవర్గ కేంద్రాల్లోని ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పీఆర్ 1 ఆప్ ద్వారా ప్రతిరోజు 4అంశాలకు సంబంధించి రిపోర్టులు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతిరోజు ఇంటింటి నుంచి వందశాతం చెత్త సేకరించే విషయంపై పంచాయతీ సెక్రటరీలు దృష్టి సారించాలన్నారు. ప్రతి 15రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంక్స్ క్లీనింగ్ చేసి క్లోరినేషన్ చేయాలని, పైపులు లీకేజీ లేకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించి తల్లికి వందనం డబ్బు లబ్ధిదారుల ఖాతాకు జమ అయ్యేలా చూడాలన్నారు.

ఓ పట్టాన తెగదే..!


బోరువేసినా మహిళ రైతు

(5వ పేజీ తరువాయి)

మొక్కజొన్నతదితర పంటలు ఎవరికివారు సాగుచేసుకుంటూ వస్తున్నారు.

తరాలు మారినా పట్టాలు ఇవ్వరా?

రైతులతో కూడిన సొసైటీకి అధ్యక్షుడుగా ఉన్న ఈడిగ సంజీవప్ప పేరున దొడఘట్ట ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద 284.71ఎకరాల భూమికి 1951లో అప్పటి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. సంజీవప్ప మరణానంతరం శివరామప్ప, తరువాత హనుమంతప్ప, ఆయన తరువాత ఈడిగ చంద్రశేఖర్ అధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. నాలుగు తరాలు మారినా ఒకే పేరుతో 284.71ఎకరాల భూమి సాగులోనే ఉంది. దీంతో సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదు. వ్యక్తిగతంగా పట్టాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.


బోరుకోసం తెచ్చిన పరికరాలు

విద్యుత్ కనెక్షన్ ఇవ్వని అధికారులు

తరాలుగా సాగు చేసుకుంటున్న భూమికి ప్రస్తుతం 300మంది వారసులు తయారయ్యారు. వీరు సాగులో ఉన్న భూమికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వ సాయం అందడం లేదు. బోరుబావులు తవ్వించుకున్నా కరెంటు కనెక్షన్ లభించని పరిస్థితి. ఈడిగ ఆదెమ్మ అనే రైతు తాను సాగు చేసుకుంటున్న భూమిలో మూడు బోర్లు వేయించారు. ఒక్కదానిలో నీరు పుష్కలంగా పడింది. విద్యుత్ కనెక్షన్ కోసం వెళితే నీ పేరుపై పట్టాదారు పుస్తకం లేదు కనెక్షన్ ఇవ్వడం కుదరదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టాక్రే నాయక్ అనే రైతుది కూడా అదే పరిస్థితి. కరెంటు వస్తుందన్న ఆశతో కరెంటు వైరు, డ్రిప్ సౌకర్యం, పైప్‌ల కోసం మోటారు కోసం రైతులు రూ.లక్షలు ఖర్చు చేశారు. విద్యుత్ కనెక్షన్ రాకపోవడంతో సామగ్రిని వారు మూలన పెట్టేశారు. సొసైటీలో కల్లుగీత కార్మికులు నామమాత్రంగా ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాల సభ్యులు అధికంగా ఉన్నారు.

సర్వే అటకెక్కించారు..

అనంతపురం జిల్లా కలెక్టర్ సోమేష్‌కుమార్ ఉన్నప్పుడు దొడఘట్ట సొసైటీ రైతులు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని విన్నవించుకోగా సర్వే అధికారులను పంపారు. భూములన్నీ సర్వేచేసి సాగులో ఎవరెవరు న్నారో వారికి పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేశారు. అయితే కలెక్టర్ సోమేష్‌కుమార్ బదిలీ కాగానే రెవెన్యూ అధికారులు భూములు సర్వే చేసి పట్టాలివ్వకుండా అటకెక్కించారు. తరువాత తహసీల్దార్ చుట్టూ తిరిగినా పట్టాలివ్వకపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో పడిపోయారు.

చర్యలు తీసుకుంటాం

దొడఘట్ట గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములు పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రికార్డులు పరిశీలించి ఎవరెవరు సాగులో ఉన్నారో క్షేత్రస్థాయిలో పర్యటించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతాం. ప్రభుత్వం రైతులకు సొసైటీ కింద పట్టా ఎప్పుడిచ్చిందో పరిశీలిస్తాం. **-ఉదయ్‌శంకర్‌రాజు, తహసీల్దార్**

భూచోళ్లు..!

(5వ పేజీ తరువాయి)

జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ప్రభుత్వం టేకులోడు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 1-10లో 2.32, సర్వేనంబర్ 1-16లో 2.37 ఎకరాలను అసైన్డ్ పట్టాగా ఇచ్చింది. అప్పట్లో ఈ భూమిని భూసేకరణలో తీసుకున్నారు. అయితే భూసేకరణ చేపట్టే సమయానికి భూయజమాని, అతని భార్య ఇద్దరు మృతి చెంది ఉన్నారు. వారికి రక్తసంబంధీకులు కూడా ఎవరూ లేకపోవడంతో ఆ భూమి అన్‌సెటిల్డ్ భూమిగా ఉండిపోయింది. దీనిని గుర్తించిన కొందరు దళారులు ఆ భూముకి వారసులుగా నకిలీ వ్యక్తులను తెరపైకి తీసుకువచ్చారు. మృతి చెందిన భూయజమాని రెండో భార్యగా ఒక మహిళను తెరపైకి తెచ్చారు. అధికారుల సాయంతో అన్‌సెటిల్డ్‌గా ఉన్న ఆ భూమికి ఆ మహిళను వారసురాలుగా ధ్రువీకరింపజేసి ఆమె పేరుతో పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయించారు. అనంతరం ఆమెకు ప్రభుత్వం నుంచి రూ. 30,48,500ల భూపరిహారాన్ని ఖాతాలో పడేటట్లు చేశారు. అలా పడిన మొత్తాన్ని దళారుల ఖాతాల్లోకి జమచేసుకున్నారు. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారింది. అయితే ఇప్పుడు కూడా ఇదే రీతిలో అన్‌సెటిల్డ్ భూముల్లో అవకతవకలకు పాల్పడి కోట్ల రూపాయలను కాజేసేందుకు కొందరు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్ భూమి

టేకులోడులో పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూముల్లో సుమారు 50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్ భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను చాలా కాలం క్రితమే రైతులు ఇతరులకు విక్రయించారు. అయితే అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో అప్పట్లో భూములు కొన్నవారు నాన్ డాక్యుమెంట్‌లో రాసుకున్నారు. దీంతో భూమి సాగుచేసుకుంటున్నా భూయాజమాన్య హక్కులు పొందలేకపోయారు. అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారాలు కాకపోవడం, అసలైన పట్టాదారుడు లేకపోవడం వంటి కారణాలతో 50 ఎకరాల భూములు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయి. ఈ భూములపై కన్నేసిన కొందరు అసలైన భూ యజమానుల స్థానంలో నకిలీ వ్యక్తులను తెరపైకి తీసుకువచ్చి భూపరిహారం కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ కీలక వ్యవహారంలో తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే ఇద్దరు అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విచారణ తరువాతే పరిహారం



టేకులోడు గ్రామంలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో నిజమైన భూ యజమానులకే ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. 600 ఎకరాల భూసేకరణలో 50 ఎకరాల వరకు అన్‌సెటిల్డ్‌గా ఉన్నాయి. వాటికి సంబంధించి పూర్తి విచారణ చేపట్టాం. ఎవరు నిజమైన భూయజమాని అనే విషయాలను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తరువాతే పరిహారానికి ఆమోదం తెలుపుతాం. అన్‌సెటిల్డ్‌గా ఉన్న భూములకు సంబంధించి రైతులు తమ వద్ద ఉన్న రికార్డులను తీసుకువస్తే పరిశీలన జరిపి, వారు నిజమైన భూహక్కుదారులా కాదా అనే విషయాలను నిర్ధారణ చేస్తాం. చేపట్టిన భూసేకరణలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిస్తున్నాం. సమస్యలు లేని 200 ఎకరాలకు ఇప్పటి వరకు పరిహారం అందజేశాం. గతంలోలా అవకతవకలు జరగకుండా పారదర్శకంగా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

-నటరాజు, తహసీల్దార్, చిలమత్తూరు మండలం

యువతే వికసిత్ భారత్ నిర్మాతలు

● వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియా


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువతే వికసిత్ భారత్-2047 నిర్మాతలని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. కళాశాలలో 'యువ కనెక్ట్ ప్రోగ్రాం' పేరుతో మంగళవారం సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పరదేశినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్‌తో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఆత్మారాం, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ శంకర్, మధుసూదన్, సమన్వయకర్త డాక్టర్ వరదరాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశమన్నారు. దేశాభివృద్ధికి యువత ఆలోచనలే పెట్టుబడి అని పేర్కొన్నారు. 2047కు వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దగలమన్నారు. అనంతరం నిర్వహించిన వ్యక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సుమన గోపీచంద్, ప్రొఫెసర్లు దుర్గ, సరళ, సురేష్, ఉమామహేశ్వరమ్మ, అసిసోసియేట్ ప్రొఫెసర్లు పద్మశ్రావణి, పూర్ణచంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చైతన్య, నీరజ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహనాయక్ పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కావాలన్నారు. ఈమేరకు అజెండా తయారు చేసి కమిటీ సభ్యులు, స్థాయి సంఘ సభ్యులకు సర్క్యులేట్ చేసినట్లు తెలిపారు. ఆర్థిక, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ-1, అభివృద్ధి పనులు స్టాండింగ్ కమిటీ -7, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ-2, విద్య, వైద్య సేవలు స్టాండింగ్ కమిటీ-4, సమావేశాలు జడ్పీ మెయిన్ హాల్‌లో నిర్వహిస్తారన్నారు. మహిళ, శిశు సంక్షేమము స్టాండింగ్ కమిటీ-5, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ-3, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ-6 సమావేశాలు జడ్పీలోని అదనపు సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన సెక్టోరల్స్ ఇంటర్వ్యూలు

● 47మందికిగాను 42మంది హాజరు

అనంతపురం విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఫారిన్ సర్వీస్ కింద పనిచేసే సెక్టోరల్స్ నియామకాలకు ఇంటర్వ్యూలు ముగిశాయి. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన 47మంది టీచర్లను ఎస్ఎస్ఏ అధికారులు ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్వ్యూలు ప్రారంభించారు. తొలిరోజు 25మందిని ఆహ్వానించగా 22మంది హాజరయ్యారు. రెండోరోజు 22మందిని ఆహ్వానించగా 20మంది హాజరయ్యారు. ఈలెక్కన మొత్తం 47మందికి గాను 42మంది టీచర్లు సెక్టోరల్స్ ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఏపీసీ శైలజ తెలిపారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ హాజరైన టీచర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఎంపిక ప్రాధాన్యంపై టెన్షన్

గతంలో సెక్టోరల్స్ పోస్టులకు హెచ్ఎంలు, ఎంఈఓలను, అసిస్టెంట్ సెక్టోరల్స్‌గా స్కూల్ అసిస్టెంట్‌లను తీసుకునేవారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం స్కూల్ అసిస్టెంట్‌లకే అవకాశం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వంలో స్కూల్‌అసిస్టెంట్‌లతో పాటు ఎస్జీటీలకు అవకాశం కల్పించింది. ఇంటర్వ్యూలు ముగియడంతో ఎంపికలో స్కూల్‌అసిసెంట్‌లకు తొలిప్రాధాన్యం ఇస్తారా, లేదంటే అందరి పాయింట్లు పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేస్తారా అన్నదానిపై అభ్యర్థులలో టెన్షన్ మొదలైంది. ఇపుడు జరిగిన ఇంటర్వ్యూలలో దాదాపు 15మంది ఎస్జీటీలు కూడా ఉన్నారు. ఈ పరిస్థితులలో ఎంపిక ప్రక్రియ ఎలా అనేదానిపై అభ్యర్థులలో సందిగ్ధత కొనసాగుతోంది.

కసాపురం ఆలయ ట్రస్టుబోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

గుంతకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ధర్మకర్తగా సేవలందించడానికి ఆసక్తి కలిగినవారు ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ ఎం విజయరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వును నోటీసు బోర్డులో ఉంచామని, పూర్తి వివరాలను దేవస్థానంలో తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి దేవస్థానంలో అందజేయాలన్నారు.

ఫ్లైయాష్‌ను ఉచితంగా ఇవ్వాలి

● లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇటుకల తయారీకి ఫ్లైయాష్‌ను ఉచితంగా అందించే విధానం తేవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఆయన లోక్‌సభలో మంగళవారం మైన్స్ అండ్ మినరల్స్ సవరణ బిల్లు-2025పై మాట్లాడారు. గత పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశం గనుల రంగంలో బలమైన , స్థిరమైన వృద్ధిని సాధించిందన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో రాష్ట్ర గనుల రంగం తీవ్రంగా వెనుకబడిందన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఖనిజ, ఇసుక అక్రమ రవాణా వల్ల వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర జీడీపీలో గనుల రంగం వాటా 3.5 శాతం నుంచి 2.7 శాతానికి పడిపోయిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వచ్చాక మైనర్ మినరల్ పాలసీ 2025 తీసుకొచ్చాక గనుల రంగానికి కొత్త ఊపిరి వచ్చిందన్నారు. బిల్లులో రెండు సవరణలు చేయాలని సూచించారు. క్లింకర్, ఫ్లైయాష్ మిశ్రమాన్ని సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా అమ్మడం వల్ల నాణ్యత సమస్యలు వస్తాయన్నారు. తర్వాత బిల్లుకు పూర్తిగా మద్దతు ప్రకటించారు.

ఈసారీనేనా..?

● నేడు రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక


పోలీసు సిబ్బందికి బందోబస్తుపై సూచనలు ఇస్తున్న రామగిరి సీఐ

రామగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక బుధవారం జరగనుంది. ఎంపీపీ ఉప ఎన్నికకు సంబంధించి అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటల నుంచి12గంటల లోపు సభ్యులు హాజరై ఎంపీపీ ఎన్నిక నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మూడుసార్లు ఎన్నిక వాయిదా పడుతూ వచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఇప్పుడు నాలుగోసారి నోటిఫికేషన్ విడుదలైనా వైసీపీ సభ్యులు అందుబాటులో లేరు. టీడీపీకి ముగ్గురు సభ్యులుండగా మిగిలిన ఆరుగురు వైసీపీ సభ్యులే. టీడీపీకి ఉన్న సభ్యులలో కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారే ఇద్దరు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వుకావడంతో మహిళా సభ్యులు టీడీపీ వైపు లేరు. దీంతో ప్రతి సారి వైసీపీ సభ్యులు గైర్హాజరు కావడం, ఎన్నిక వాయిదా పడటం జరుగుతోంది. ఈసారి కూడా వైసీపీ సభ్యులు ఎన్నికకు వచ్చేది అనుమానమే. వైసీపీ వర్గాలు తాము ఎన్నికకు రామని బాహాటంగానే చెబుతున్నాయి. కాగా ఎంపీపీ ఉప ఎన్నికకు ఇద్దరు డీఎస్పీలు, సీఐలు ఆరుగురు, ఎస్ఐలు ఏడుగురు, పీఎస్ఐలు ఆరుగురు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 34 మంది, పోలీసులు 56 మంది, ఏపీఎస్పీ ప్లటూన్ 1, స్పెషల్ పార్టీ 2 బందోబస్తు చర్యలు చేపట్టినట్టు సీఐ శ్రీధర్ తెలిపారు. ఎన్నికల అధికారి సంజీవయ్య, ఎంపీడీఓ గంగావతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆగని వాన


విడపనకల్లు మండలం మాళాపురం వద్ద కంది చేనులో నిల్వ ఉన్న నీరు

అనంతపురం అర్బన్/కొత్తచెరువు/విడపనకల్లు/కూడేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వరుస వర్షాలు కొనసాగుతున్నాయి. పలు మండలాల్లో సోమవారం రాత్రి వాన పడింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

ఉద్యాన పంటలకు నష్టం

గుంతకల్లు, కంబదూరు, కూడేరు, విడపనకల్లు, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, గుంతకల్లు, గుత్తి, కంబదూరు మండలాల్లో ఉల్లి, పచ్చిమిరప, అరటి, టమోటా పంటలు దెబ్బతిన్నాయి. కూడేరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సాగు చేసిన టమోటా పంట దెబ్బతింది. వర్షానికి కాయలు రాలిపోయాయి. విడపనకల్లు మండలంలో కంది చేలలోకి నీరు చేరడంతో పంట దెబ్బతింది. పొలికి అంచనహాలు పెద్దవంక ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విడపనకల్లు-ఆర్ కొట్టాల, పాల్తూరు-గోవిందవాడ, ఉండబండ-ఉరవకొండ వంకలు జోరుగా ప్రవహించాయి.


కుళ్లిపోయిన టమోటా కాయలను చూపుతున్నరైతు నాగేంద్ర

వజ్రకరూరులో భారీ వర్షం

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా వజ్రకరూరులో 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కూడేరు 3.5, బెళుగుప్ప, ఆత్మకూరు, ఉరవకొండ 3.2, బుక్కరాయసముద్రం 2.8, అనంతపురం 2.0, బొమ్మనహాళ్ 1.6, రాప్తాడు 1.5, గార్లదిన్నె, నల్లచెరువు 1.2, పెద్దవడుగూరు, విడపనకల్లు 1.1, పుట్టపర్తి 1.0 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.0 సెంటీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది. మంగళవారం బెలుగుప్పలో ఓ మోస్తరు వర్షం, గుత్తి, తాడిపత్రి, యాడికి, పుట్లూరు, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.


కూడేరు మండలంలో వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

ప్రజలకు జీవనోపాధి కల్పించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కదిరి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పీ4తో ప్రజలకు జీవనోపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా మహాసభలను మంగళవారం స్థానిక బడా సుబ్బిరెడ్డి, కోలా రామాంజనేయుల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మార్గదర్శకులను తీసుకొచ్చి బంగారు కుటుంబాలు ఎంపికచేసి సాయం చేయాలని చెప్పడం కంటే, వారికి జీవనోపాధులు కల్పిస్తే బాగుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలన్నారు. నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో 3 మాత్రమే అమలు చేశారన్నారు. మిగిలిన మూడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళలు, పురుషులను గుర్తించడానికి ఆధార్‌కార్డు ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ.. ఎన్నికల కమిషన్‌ను తనజేబు సంస్థలా వాడుకుంటోందన్నారు. దొంగ ఓట్లు వేయించుకోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా నూతన కార్యదర్శి రామక్రిష్ణ, నేతలు జీఎల్ నరసింహులు పాల్గొన్నారు.


జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రామక్రిష్ణ

మొదటి మహిళా లోకో పైలెట్‌కు ప్రశంస


అమలా కుమారికి ఆఫీసు ఆర్డర్ అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లోకోపైలెట్‌గా ప్రమోషన్ సాధించి, గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలి మహిళా లోకో పైలెట్‌గా రికార్డు సృష్టించిన అమలా కుమారికి డీఆర్ఎం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సహాయ లోకోపైలెట్‌గా 44 మంది మహిళలు విధులను నిర్వర్తిస్తున్నారు. లోకో పైలెట్‌గా ట్రైనింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసి రైలును స్వతంత్రంగా నడప డానికి అర్హతను సాధించారు. దీంతో ఆమెకు లోకోపైలెట్‌గా ప్రమోషన్ లభించింది. ఈ కారణంగా అమలాకుమారి గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలి మహిళా లోకోపైలెట్‌గా గుర్తింపు పొందారు. మంగళవారం తన కార్యాలయానికి రప్పించిన డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అమలా కుమా రికి ప్రశంసలందజేసి, ఆఫీసు ఆర్డరును అందజేశారు. విధినిర్వహణలో నిబద్ధత చాటినందుకు, తొలి మహిళా లోకో పైలెట్‌గా గుర్తింపు పొందినందుకు అభినందించారు. లోకో పైలెట్‌గా ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ (టీఆర్ఎస్ఓ-జీటీఎల్) సీ వీరయ్య, డీపీఓ (కో-ఆర్డినేషన్) హెచ్ ఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే సెక్షన్‌ను పరిశీలించిన డీఆర్ఎం

గుంతకల్లు-ఖాదర్‌పేట్-కల్లూరు రైల్వే సెక్షన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఉదయం తనిఖీచేశారు. ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా ట్రాక్ పటిష్టతను పరిశీలించారు. సమస్యాత్మకంగా ఉన్న ట్రాక్ ప్రదేశాన్ని గుర్తించి ఫిట్నెస్ కల్పించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మార్గంలో ట్రాక్ వంకరగా ఉన్న చోట్ల పరిస్థితిని అంచనా వేశారు. కార్యక్రమంలో డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధాకర్, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

బియ్యం మొత్తం సీజ్ చేస్తాం

● జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు

● రేషన్ బియ్యం దందాపై పూర్తి వివరాలు వెల్లడించని అధికారులు


రెండోరోజు బియ్యాన్ని గోడౌన్‌కు తరలిస్తున్న దృశ్యం

యాడికి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం మొత్తం సీజ్ చేస్తామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మిల్లులోని రేషన్ బియ్యంను సివిల్ సప్లై గోడౌన్‌కు తరలింపును ఆయన మంగళవారం పర్యవేక్షించారు. మిల్‌లో రేషన్ బియ్యం నుంచి తీసిన సన్నబియ్యంను పరిశీలించారు. ఎంత మొత్తంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారు, ఇంతవరకు ఎన్ని టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్‌సప్లై గోడౌన్‌కు తరలించారు అనే విషయాలను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లై డిప్యూటి తహసీల్దార్ మల్లేష్‌తో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులోని మొత్తం బియ్యాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. మిల్లులోని బియ్యం రేషన్ బియ్యం అనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. వీటన్నింటిపై నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండోరోజు రేషన్ బియ్యం తరలింపు

మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం తరలింపు రెండో రోజు కొనసాగింది. సీఐ ఈరన్న, సీఎస్‌డీటీ మల్లేష్ రేషన్ బియ్యం తరలింపును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మూడులారీల్లో రేషన్ బియ్యంను గుంతకల్లులోని సివిల్‌సప్లై గోడౌన్‌కు మంగళవారం తరలించారు. సుమారు 300టన్నుల బియ్యాన్ని గోడౌన్‌కు తరలించినట్లు చర్చించుకుంటున్నారు. అయితే దీనిపై కచ్చితమైన వివరాలను అధికారులు వెల్లడించలేదు. రేషన్‌బియ్యం దందాపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించడానికి ఒకటిరెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

సర్వత్రా చర్చ

మిల్లులో సుమారు 300టన్నుల రేషన్ బియ్యం ఎలా నిల్వ ఉంచారు. ఈ నిల్వలపై అధికారులకు సమాచారం లేదా? ఇదంతా ఒక గుడూపుఠాణిలా సాగుతోందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం వ్యాపారంలో కొందరు నాయకులు తమకు వాటాలు కావాలని మిల్ ఓనర్‌తో వాదనకు దిగారని, దానికి ఆయన ససేమిరా అనడంతోనే ఈ గూడు పుఠాణి వెలుగులోకి వచ్చిందంటూ చర్చించుకుంటున్నారు.

రైస్‌మిల్ సీజ్

యాడికి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసిన మిల్‌ను మంగళవారం రాత్రి పోలీసులు, సివిల్‌సప్లై అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లులోని రేషన్ బియ్యం అన్నింటిని గుంతకల్లు సివిల్‌సప్లై గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు. పూర్తివివరాలను తొందరలోనే వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాడికి సీఐ ఈరన్న, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.


రైస్‌మిల్‌ను సీజ్‌చేస్తున్న పోలీసులు, పౌరసరఫరాల అధికారులు

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం


భరత్‌కుమార్

గుత్తి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు మండలంలోని వెంగన్నపల్లి సర్పంచ్ భరత్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానపత్రం పంపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో మెరుగైన పనితీరు కనబరచిన సర్పంచ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పది మందిని ఎంపిక చేశారు. వారి భరత్‌కుమార్ కూడా ఉన్నారు. దీంతో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

బొందలవాడ సర్పంచ్‌కు రాజ్‌భవన్ పిలుపు


ఆలం శిరీషా

నార్పల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ సర్పంచ్ ఆలం శిరీషకు అరుదైన గౌరవం దక్కింది. గతంలో జడ్పీటీసీగా, ప్రస్తుతం సర్పంచ్‌గా ఆమె చేసిన సేవలను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనాలని రాజ్‌భవన్ వర్గాలు కోరాయి. రాజ్‌భవన్ ఆహ్వానం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకురాలికి..


విష్ణుప్రియ

అనంతపురంరూరల్, (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు విష్ణుప్రియకు రాష్ట్ర రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. మంగళవారం గవర్నర్ కార్యాలనుంచి ఉత్తర్వులు వచ్చినట్లు విష్ణుప్రియ పేర్కొన్నారు. రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఆమె సేవలను గుర్తించి, ఈ అవకాశం కల్పించారు. దీంతో అధ్యాపకురాలు విష్ణుప్రియ ఆనందం వ్యక్తం చేశారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన పాఠశాలల నుంచి క్రీడాప్రతిభా అవార్డులు 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ క్రిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రదర్శనలు మాత్రమే ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారన్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల మేనేజ్‌మెంట్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సర్టిఫికెట్‌లు హెడ్‌మాస్టర్, పీఈటీ, పీడీ సంతకాలతో జిరాక్స్ కాపీలను సమర్పించాలన్నారు. టీం ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్‌లను పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రతిక్రీడలో అత్యధిక స్కోర్ సాధించిన పాఠశాలలు , స్కోర్ అగ్రస్థానంలో ఉన్న పాఠశాలలను అవార్డులకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. డీఈఓ అధ్యక్షతన ఐదుగురు సభ్యుల గల కమిటీ ద్వారా దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడాదినోత్సవం ఆగస్టు 29న అవార్డులు అందజేస్తామని తెలిపారు.

హెచ్‌ఐవీ నివారణపై విస్తృత ప్రచారం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల నియంత్రణ, మాదక ద్రవ్యాల వినియోగ చెడు ప్రభావాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు జీవీ రమణ అధ్యక్షతన మంగళవారం ఆమె పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ సర్కిల్, జడ్జి బంగ్లా వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి ఓబులు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు మురళీమోహన్, రైడ్స్ క్రిష్టప్ప, లింక్ వర్కర్ రమేష్, అనంత నెట్‌వర్క్ సిబ్బంది, ఎన్జీఓ మేనేజర్లు నరేష్, మహేష్, శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రమేష్, నీలకంఠ పాల్గొన్నారు.

డంప్‌పై దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం...!

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాల డంప్‌పై ఎస్పీ జగదీష్ విచారణకు ఆదేశించారు. సమగ్రంగా విచారణ చేయాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. ఆత్మకూరు మండలం వేపచెర్ల సమీపంలో కొండగుట్ట ప్రాంతంలో పేలుడు పదార్థాలున్నట్టు ఆత్మకూరు పోలీసులు గుర్తించారు. 90 డిటోనేటర్లు, 9ఎంఎం రౌండ్లు 70, ఐరన్‌బాల్స్ 20, వైట్ రబ్బర్ ఖాళీ కాక్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగుట్ట ప్రాంతంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాల డంప్ బయటపడటంపై సంబంధిత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డంప్ ఎవరు, ఎందుకు, ఎప్పుడు చేశారన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వీఆర్‌కు పట్నం ఎస్ఐ రాజశేఖర్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్నం ఎస్ఐ రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్వర్వులు జారీచేశారు. ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విచారణలో ఆరోపణలు రుజువైతే ఎస్ఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాయని ఎస్పీ తెలిపారు.

నెట్టికంటి స్వామికి వెండి రథ

ప్రాకారోత్సవం


వెండి రథంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

గుంతకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా కసాపురంలోని శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములకు వెండిరథంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. పూర్వాభాద్ర తిరునక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో మన్యసూక్త హోమాన్ని నిర్వహించారు. స్వామివార్ల చిత్రపటాలను ఉంచి, వేదపండితులు హోమం చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఆశీనులు చేసి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు రాఘవాచారి, వేదపండితుడు రామకృష్ణావధాని పాల్గొన్నారు.

ఎరుపెక్కిన అనంత

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు ప్రారంభం

నగరంలో భారీ ర్యాలీ

అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించండి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



ర్యాలీ చేస్తున్న సీపీఐ రామక్రిష్ణ, అక్కినేని వనజ ఇతర నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): అనంత వీధులు ఎరుపెక్కాయి. వందలాది మంది సీపీఐ శ్రేణుల ర్యాలీతో రోడ్లు ఎర్ర రంగును పరచుకున్నాయి. సీపీఐ జిల్లా మహాసభలు మంగళవారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సీపీఐ శ్రేణులు, కళాకారులు నృత్యాలు చేస్తూ, ఎర్రజెండాలను చేతబూని ర్యాలీ చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా కేఎస్ఆర్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద వరకు సాగారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ.. ధైర్యంగా మాట్లాడేవాడే కమ్యూనిస్టు అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా ఎర్రజెండా అక్కడ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయనీ, అందరూ ముందుకొచ్చి అన్యాయాలు, అక్రమాలపై ధైర్యంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ తరహాలోనే కూటమి పాలన సాగుతోందన్నారు. జగన్ ఇంట్లో కూర్చుని బటన్లు నొక్కుతూ పాలన మరచిపోవడంతో ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబుకు ఊహించని విధంగా 164సీట్లు రావడంతో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఎమ్మెల్యేల అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో రాజకీయాలు దారుణంగా తయారయ్యాయన్నారు. ప్రజల కోసం కాకుండా కేవలం స్వార్థం కోసం అధికారంలోకి రావడానికి కుట్రలు పన్నుతూ పార్టీలను దెబ్బతీస్తున్నాయన్నారు. ఇలాంటి స్వార్థ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర నేతలు జగదీష్, రామాంజనేయులు, జాన్సన్ బాబు, జిల్లా నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, సంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాల్, రామకృష్ణ, లింగమయ్య, రమణయ్య, పద్మావతి, రంగయ్య, సంతోష్, చిరంజీవి, రాజేష్, నాగరాజు, కళ్లాయిస్వామి, చెన్నప్ప, వందలాదిమంది సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రి సోమణ్ణకు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం వినతి


కేంద్ర మంత్రి సోమణ్ణను కలిసిన టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం

అనంతపురం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్నను టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఆయన సోదరుడు పరిటాల సిద్ధార్థ కలిశారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171-600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లెవెల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేయకపోవడం మూలంగా ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవలే కేతిరెడ్డి కాలనీ వద్ద ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో వెంటనే అక్కడ లెవెల్ క్రాసింగ్ గేటుగానీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిగానీ ఏర్పాటు చేయాలని కోరారు. తమ ప్రాంత ప్రజలు తిరుపతికి వెళ్లేందుకు తీవ్ర వ్యవప్రయాసాలు పడుతున్న నేపథ్యంలో రామగిరి మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అనంతపురంలోని రాంనగర్, నాయక్‌నగర్‌లోని రైల్వే లైన్ క్రాస్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి చేశారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామిని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కలిశారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనపై చర్చించారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు అత్యంత అనువుగా రవాణా మార్గం ఉన్న ఉమ్మడి అనంత జిల్లా పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతమని కేంద్ర మంత్రికి వివరించారు. భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు పరిశీలిస్తామని కేంద్ర మంత్రి.. ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, పక్కన డీఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్ పీడీ

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్స వాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ అగస్టీన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నులిపురుగుల (ఆల్బెండజోల్) నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆహారాన్ని తీసుకునే ముందుగా చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. విస్మరిస్తే గోళ్లలోని బ్యాక్టీరియా పొట్టలోకి చేరుకుని నులిపురుగుల నివాసానికి ఆవాసంగా మారుతుందని పేర్కొ న్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల శుభ్రతను పాటించేలా తగిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు నరేష్, నాగేంద్ర మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా నులిపురుగులు నశిస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసుగల 599852మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఎంఈఓ వెంకటస్వామి, స్కూల్ హెడ్‌మాస్టర్ సుజాత, వైద్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ రోహిత్ నాయుడు, డెమో త్యాగరాజు, హెచ్‌ఈఓ గంగాధర్, ఎంహెచ్‌ఓలు రంగస్వామి, జగదీష్, మేనేజర్ రజిత, సైకాలజిస్ట్ సుందర్‌రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్ పరిశీలన


మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం పరిశీలించారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. సమర్థవంతంగా పరేడ్ నిర్వహించేలా సాయుధ బలగాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లివిరిసేలా పరేడ్ నిర్వహించాలన్నారు. ఏఆర్ సాయుధ బలగాలతోపాటు డాగ్‌స్క్వాడ్, ఎన్‌సీసీ విద్యార్థులు సైతం ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు వివరాలను స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి మంగళవారం ప్రకటించారు. ఎంపికైన జట్లు ఈనెల 14 నుంచి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జరిగే 10వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటాయన్నారు.

బాలుర జట్టు: మనీష్, సంతోష్, సంజయ్‌రెడ్డి, చైత్రేష్, మనోజ్‌కుమార్, విజయ్, రాహిల్, సాయిహర్ష, లక్ష్మినరసింహ, కౌషిక్, కరీం, ఖాజా ఎంపికయ్యారు. కోచ్‌గా అఫాశ్‌ఖాన్ నియమితులయ్యారు. బాలికల జట్టు: సోహానా, యామిని, నిక్కీశ్రీ, వైష్ణవి, పల్లవి, కిరణ్మయి, ధన్వి, పరిమళ, అజున, యశశ్వని, శ్రావణి, హర్షిత ఎంపికయ్యారు. కోచ్‌గా నరేంద్ర కృష్ణ నియమితులయ్యారు.

మున్సిపల్ ఆర్డీగా నాగరాజు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)గా నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర మున్సిపల్ డైరెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయ అడిషినల్ డైరెక్టర్‌గా ఉన్న నాగరాజును అనంతపురం ఆర్డీగా నియమిస్తూ బదిలీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న రవీంద్రబాబును ఇక్కడికి బదిలీ చేసినా ఆయన చేరలేదు. దీంతో నాగరాజును అనంతపురం ఆర్డీగా బదిలీ చేశారు. ఇంతకు మునుపు నాగరాజు అనంత నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయన ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8,500, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 510 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం కిలో టామోటా లు గరిష్ఠంగా రూ.45తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.34తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రూ.70వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు


డబ్బులు పోగొట్టుకున్న బాధితులు

లేపాక్షి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.70వేలు కాజేసిన సంఘటన సోమవారం లేపాక్షిలో జరిగింది. బాధితులు ఇస్మాయిల్, రహమతి తెలిపిన మేరకు ఒక తెలియని నంబరు నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో ఓ వ్యక్తి ఫోన్‌చేసి 'తాను ప్రభుత్వ అధికారిని అని, వెలుగు సంస్థ నుంచి మాట్లాడుతున్నానని, మీరు డ్వాక్రాలో తీసుకున్న వడ్డీ రుణం రూ.40వేలు మీ ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మీ ఫోన్‌పేలో బ్యాలెన్స్ ఎంతుంది' అని అడిగాడు. ఇది నిజమని నమ్మి రూ.70వేలు ఉందని ఇస్మాయిల్ తెలిపాడు. మేము వడ్డీ డబ్బు ఖాతాలో జమ చేస్తున్నామని ఫోన్‌పే ఓపెన్ చేయమని అడిగాడు. నిజమని నమ్మి ఫోన్‌పే తెరిచాడు. అతను చెప్పిన విధంగా బ్యాలెన్స్ చెక్ చేసి, గంటను నొక్కాడు. దీంతో రూ.44,490 కట్ అయింది. మళ్లీ ఒకసారి గంటను నొక్కగా రూ.17,103 కట్ అయింది. మూడోసారి రూ.8,201కట్ అయింది. మీ ఖాతాలో మొత్తం డబ్బు రేపు జమ అవుతుందని చెప్పి సైబర్ నేరగాడు కాల్ కట్ చేశాడు. అనుమానంతో బాధితులు తిరిగి అదే నంబరుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బాధితులు లేపాక్షిలో ఫుట్‌పాత్‌మీద బండిలో దోసెలమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దంపతులకు నలుగురు ఆడపిల్లలు. ఇంటి మరమ్మతుల కోసం డ్వాక్రాలో లోన్ తీసుకుని ఖాతాలో పెట్టుకున్నామని, ఇలా మోసంతో మా సొమ్ము కాజేస్తారా అని భార్య భర్తలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గంజాయి విక్రేత పరారీ

కదిరిఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో గంజాయి విక్రేత పరారైన సంఘటన మండలంలోని సున్నపుగుట్టతండాలో మంగళవారం జరిగింది. గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు గ్రామానికి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న గంజాయి విక్రేత షామీర్ పరారయ్యాడు. గ్రామంలో షామీర్ గంజాయి విక్రయిస్తు, సేవిస్తూ గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్నాడని, పిల్లలు, మహిళలు తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఉందని పలువురు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు ఫోన్ చేయడంతో తమ సిబ్బంది గ్రామానికి వెళ్లే లోపు అతను పారిపోయాడన్నారు. అతను గంజాయిని మద్యంగా భ్రమించి సేవిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారన్నారు. పరారైన షామీర్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సేవాఘడ్ గురుకులంలో ప్రవేశాలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డిలో ఉన్న సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేశాఖ డీడీ శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్‌లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడీ కోరారు.

శాస్త్రోక్తంగా సంకష్ట చతుర్థి పూజలు



తిలక్‌రోడ్డు రామాలయంలో ప్రత్యేక అలంకరణలో గణపతి

అనంతపురం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాలు, వినాయకుని మందిరాల్లో పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో హెచ్చెల్సీ కాలనీలో గల ననసకోట ముత్యాలమ్మ ఆలయం, తిలక్‌రోడ్డు కోదండ రామాలయం, మూడోరోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంతో పాటు ఇతర ఆలయాల్లో గణనాథుని మూలవిరాట్‌లకు అర్చకులు వివిధ అభిషేకాలు చేయడంతోపాటు కుడుముల మాలలు, వివిధ రకాల పూవులు, గరికతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా సంకష్టహర వ్రతాలను ఆచరించారు.

విద్యుత్ అదాలత్‌కు 11 ఫిర్యాదులు

అనంతపురం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సాయంత్రం పాతూరు పవరాఫీస్ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు అనంతపురం డివిజన్ పరిధిలో మొత్తం 11 మంది నుంచి ఫిర్యాదులు అందాయి. అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి పరిశీలకుడుగా వ్యవహరించి వినియోగదారులనుంచి అర్జీలను స్వీకరించారు. అనంతపురం నగరంతో పాటు అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వివిధ విద్యుత్ సమస్యల పరిష్కారం కోరుతూ 11 ఫిర్యాదులను అందజేశారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి స్పందిస్తూ ఈ ఫిర్యాదులన్నింటినీ విద్యుత్ సిబ్బందితో త్వరితగతిన పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంజన్నకు సిందూర అలంకారం



బొమ్మనహాళ్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి శ్రావణ మాసం మూడో మంగళవారం సందర్భంగా సిందూర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతల నుంచి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ర్యాలీ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేదలకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని ఆ సంస్థ అభిమానులు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానులు ఎమ్మార్పీఎస్ మద్దతుతో చెన్నేకొత్తపల్లిలో మంగళవారం ఈ మేరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి కాపాడుకుంటాం ఆర్డీటీసంస్థనంటూ నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

'నియామక ఉత్తర్వులు రద్దు చేయండి'

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గత నెలలో చేపట్టిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నియామక ఉత్తర్వులు రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్కేయూ వైస్ చాన్సలర్ అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో తమ వర్గానికి చెందిన ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇదే విషయాన్ని వర్సిటీలోని ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నతాధికారులు దృష్టికి తీసెళ్లారన్నారు. అయినా న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా తమవర్గం వారికి న్యాయం చేయాలని ఆయన వీసీని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వేమన్న, శీన తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌పై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్, జేఎన్‌టీయూఏ సంయుక్తంగా డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో క్వాంటం కంప్యూటింగ్‌పై అధ్యాపకులకు ఒక్కరోజు అవగాహన సదస్సును నిర్వహించారు. జేఎన్‌టీయూ ఆర్యభట్టా ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమాన్ని వీసీ ఆచార్య సుదర్శన రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంత పరిధిలోని జేఎన్‌టీయూలో క్వాంటం టెక్నాలజీస్ రంగంలో మొట్టమొదటిసారిగా సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్వాంటం కంప్యూటింగ్ జేఎన్‌టీయూఏ, అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిల్స్‌ను త్వరలో స్థాపించబోతున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు అమరావతిలో క్వాంటం వ్యాలీకి అనుగుణంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధ్యాపకులు క్వాంటం టెక్నాలజీస్ గురించి అవగాహన పొంది వారి కళాశాలలో విద్యార్థులకు భవిష్యత్ సాంకేతికతను పరిచయం చేయడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ..అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులు ఉన్నతమైన ఇండస్ట్రీ నైపుణ్యాలనికి సంబంధించిన కార్యక్రమాలు తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు. క్యూ క్వాంటం ల్యాబ్స్ అధినేత కల్నల్ సాయి శంకర్, డీపీపీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ శోభాబిందు, అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసభారతి, కిషోర్, దీపక్ ద్వివేది, ముత్తుకరుప్పన్, ఆచార్య పీఆర్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువజన దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువజన దినోత్సవాన్ని నగరంలోని మైభారత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కేంద్ర యువజన క్రీడా శాఖ, మై భారత్, యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మై భారత్ అధికారులు మాట్లాడుతూ దేశ సేవలో భాగంగా యువత సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధించుకునే సత్తా యువతకు మాత్రమే ఉందన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు యువత పనిచేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆధ్యాత్మికవేత్త ప్రసాద్, మానసిక వైద్యనిపుణులు గరుగు బాలాజీ, మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ఆన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మై భారత్ అధికారులు



ఉదయం 10 గంటలు దాటినా తెరుచుకోని ఏఎంసీ కమిషనర్ చాంబర్



ఖాళీగా దర్శనమిస్తున్న ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ కుర్చీ



మూసి ఉన్న ఎంహెచ్‌ఓ, డీఈ చాంబర్లు

ఏఎంసీలో కొరవడిన సమయపాలన

- కార్యాలయానికి సమయానికిరాని అధికారులు, ఉద్యోగులు
- విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. ఉదయం 10గంటలకు హాజరుకావాల్సిన వారు మధ్యాహ్నం 12గంటలు అయినా రావడం లేదు. అంతా మా ఇష్టం. మమ్మెల్ని ఎవ్వరు అడిగేది అనే తీరుతో వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయాన్ని మంగళవారం ఉదయం 10 గంటల పైన ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఇందులో అధికారులు, సిబ్బంది కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కమిషనర్ చాంబర్‌కి తాళం వేసి ఉండగా.. డిప్యూటీ కమిషనర్ కుర్చీ ఖాళీగా దర్శనమిచ్చిది. ఎంహెచ్‌ఓ, డీఈ సుభాష్ చంద్రబోస్ చాంబర్లు మూసి ఉన్నాయి. ప్రధాన పరిపాలన విభాగంలో ఏఓతో పాటు సిబ్బంది కుర్చీలు ఉదయం 11:30గంటల సమయంలోనూ ఖాళీగానే కనిపించాయి. ఇక జననమరణ విభాగం ఏఎస్ఓ, మలేరియా విభాగం ఇన్‌చార్జి అధికారి కుర్చీలు కూడా ఖాళీగానే దర్శనమిచ్చాయి. కొందరు ఉద్యోగులు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి బయట తిరుగుతూ కనిపించారు. మరి కొందరు వేళాపాలా లేకుండా విధులకు చుట్టపుచూపుగా అలా ఇచ్చి ఇలా వెళ్లారు. అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి విధులకు రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు. నగర ప్రజలు ఏదైనా పనిమీద కార్యాలయానికి వచ్చినా సంబంధిత అధికారి, ఉద్యోగి విధులకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వచ్చే వరకు వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీస బాధ్యత లేకుండా ఏఎంసీ అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఖాళీగా ఉన్న జనన, మరణ విభాగం ఏఎస్ఓ, మలేరియా విభాగ ఇన్‌చార్జి కుర్చీలు

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



అనంతలక్ష్మి కళాశాలలో రంగనాథన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకపల్లి వద్ద గల అనంత లక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి కళాశాల చైర్మన్ అనంతరాముడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతరాముడు మాట్లాడుతూ.. గ్రంథాలయాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసిన గొప్ప మేధావి ఎస్ఆర్ రంగానాథన్ అని తెలిపారు. దేశ స్వాతంత్య్ర సాధనలో గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు , గ్రంథాలయాధికారి రామాంజనేయులు, గణిత విభాగాధిపతి విశ్వనాథ్, ఉప గ్రంథాలయాధికారి వన్నూర్‌వలి, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారిణి కావేరి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు కొట్టివేత

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులపై గత వైసీపీ ప్రభుత్వంలో నమోదైన కేసును జిల్లా కోర్టు కొట్టివేసింది. 2023లో హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అప్పటి మంత్రి శంకర నారాయణ తీరును బీజేపీ నాయకులు ఖండించారు. ఆ ఖండనలను వక్రీకరిస్తూ 10మంది బీజేపీ నాయకులపై వైసీపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. కేసు పూర్వాపరాలు విచారించిన జిల్లా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హారిక కేసును కొట్టివేసినట్లు న్యాయవాది హంపాపురం ఆదినారాయణ మంగళవారం తెలిపారు. దీంతో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రత్నమయ్య, అల్లాడి రామచంద్రయ్య, గొంది అశోక్, శ్రీనివాసులు, ఈశ్వర్‌ప్రసాద్, రావెల చైతన్య, గోవర్ధన్, గణేష్‌లకు కేసు నుంచి ఊరట లభించింది. చివరికి న్యాయం గెలిచిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

'వడ్డీతోనే రుణాలను రెన్యువల్ చేయాలి'

ఆత్మకూరు ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బంగారం పై తీసుకున్న రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలోని కెనరాబ్యాంకు వద్ద పలు గ్రామాల రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అసలు చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని బ్యాంకు అధికారులు పేర్కొనడం దారుణమన్నారు. పంటలు సరిగా పండక ఇబ్బంది పడుతున్న రైతులు ఇప్పటికిప్పుడు అసలు ఎలా కడతారని ప్రశ్నించారు. కనుక వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లాసహాయకార్యదర్శి బీహెచ్ రాయుడు, నాయకులు శంకర్,సోమశేఖర్,రాము,జయమ్మ, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాప్తాడు/నార్పల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కడుపులో నులిపురుగల నివారణకు రాప్తాడు మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ నాగేంద్ర పరిశీలించారు. నార్పల మండలంలోని బీ పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దుగ్గుం మండల పరిషత్ ఆదర్శ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. వైద్యాధికారులు, ప్రజాప్రనిధులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

శింగనమలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శింగనమల, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల్లో జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీ చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత



చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లిలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి/ రాప్తాడు/ రామగిరి/ అనంతపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి మండలం పైలటంబుళపల్లి, వెంకటంపల్లిగ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, అధికారులు మంగళవారం నిర్వహించారు. ఇందులో పలువురు గ్రామస్థులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండుటంబులేశు, సింగిల్‌విండో చైర్మన్‌నరసింహులు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రజల వద్ద నుంచి దాదాపు 100కు పైగా వినతిపత్రాలు స్వీకరించారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు గంగలకుంట రమణ కిష్టా, తదితరులు పాల్గొన్నారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, పరంధామయాదవ్, ఆవుల ముత్యాలు, శివకుమార్, చిత్తరంజన్‌తదితరులు పాల్గొన్నారు. ఇక అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామంలో చేపట్టిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సర్దార్‌వలి, వీఆర్వో రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ మెంబర్ వేణుగోపాల్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పామురాయి రఘు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి, గ్రామకమిటీ అధ్యక్షుడు ధర్మేంద్ర, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. 35రోజుల పాటు బెంగుళూరులో ఉచిత శిక్షణతోపాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000487423ను సంప్రదించాలని కోరారు.

ఓపీఎస్‌ను అమలు చేయండి: యూటీఎఫ్

అనంతపురం విద్య, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లాకార్యాలయంలో మంగళవారం వారు స్కూల్‌టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్‌ఇండియా ఆవిర్భావవేడుకలను నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, సీనియర్ నాయకులు జిలాన్, రమణయ్య, నాగేంద్రీశ్వరయ్య, పవన్ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అన్నిరాష్ట్రాల్లోని ఉపాధ్యాయసంఘాలు కలిపి ఎస్టీఎఫ్ఐ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం ఐక్యపోరాటాలు సాగిస్తున్నామన్నారు. కూటమి సర్కారు సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటింటి చెత్త సేకరణపై జడ్పీ సీఈఓ ఆరా

రాప్తాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా అని జడ్పీ సీఈఓ శివశంకర్ ఆరాతీశారు. మండలంలోని హంపాపురంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని కొన్ని ఇళ్ల వద్దకు వెళ్లి మీ ఇంటి వద్దకు చెత్త సేకరణ బండి సక్రమంగా వస్తోందా, సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అమృత్ సరోవర్ వద్ద జెండా వందనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్తరారాధన వేడుకలు



జేఎన్‌టీయూ రోడ్డులోగల రవీంద్రస్వామి ఆశ్రమంలో అలంకరణలో రాఘవేంద్ర స్వామివారు



మొదటిరోడ్డులో రథం ముందు భక్తుల కోలాటం

అనంతపురం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్తరారాధన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి బృందావనానికి నిర్మల్య విసర్జన గావించడంతో పాటు అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, పాదపూజ, కనకాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి పురవీధులగుండా ఊరేగించారు. రథోత్సవం ముందు భక్తులు కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. జేఎన్‌టీయూ రోడ్డులోని రవీంద్రస్వామి ఆశ్రమంలోనూ రాఘవేంద్రస్వామి ఉత్తరారాధన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల చేత స్వామివారి చిత్రపటానికి పుష్పార్చనలు చేయించారు. అనంతరం పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేవారు. సాయంత్రం ఆశ్రమ ఆవరణలో సద్గురు రవీంద్ర స్వామీ జీ భక్తులకు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- పీఆర్ ఇంజనీర్లకు జడ్పీ సీఈఓ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని డీఎల్‌డీఓ కార్యాలయాల రెన్యూవేషన్‌కు సంబంధించి అభివృద్ధి పనులపై వేగం పెంచి ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలను ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లాలోని పీఆర్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సోమవారం జూమ్ మీట్ ద్వారా పీఆర్ కమిషనర్ డీఎల్‌డీఓ కార్యాలయాల అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారన్నారు. అందుకనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, ధర్మవరం ప్రాంతాల్లో డీఎల్‌డీఓ కార్యాలయాలకు సంబంధించి ఇప్పటికే జెడ్పీ సాధారణ నిధులనుంచి అక్కడ పరిస్థితులకు అనుగుణంగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. దీంతో ఈ నెల 20 లోపు రెన్యూవేషన్ పనులు పూర్తి చేసి అందుకు అనుగుణంగా ఆధారాలతో కమిషనర్ కార్యాలయానికి పంపాల్సి ఉంటుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కేటాయించిన పనులను కూడా గడువులోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు రసూల్, మురళి, సుధాకర్ నాయక్, ఎల్లమనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



సంక్షేమ హాస్టల్లో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రమణయ్య, నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 90ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాకేంద్రంలో మంగళవానం ఘనంగా జరిపారు. గిల్డ్‌ఆఫ్ సర్వీస్‌స్కూల్‌సమీపంలో ఉన్న సంక్షేమహాస్టల్లో విద్యార్థుల సమక్షంలో జెండాను ఏఐఎస్ఎఫ్ పూర్వపునాయకుడు రమణయ్య ఆవిష్కరించారు. ఈసందరర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ,విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ గత 90ఏళ్లుగా నిరంతరంగా పోరాటాలు సాగిస్తూ వస్తోందన్నారు. అదే స్ఫూర్తితోనే ప్రతిఏఐఎస్ఎఫ్ కార్యకర్త ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయప్ప, నాయకులు నరసింహ, మంజునాథ్, సమీర్,చందు తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్కేయూ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ..ఏఐఎస్ఎఫ్ ఏర్పాటై నేటికి 90ఏళ్లు కావస్తోందన్నారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేసి ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని ఆ సందర్భంగా కోరారు. నాయకులు సుబ్బరాయుడు, సాయి మహేష్, జగదీష్, రాజు, వినోద్, విలియమ్స్ సాయి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలు చేసేవారిపై చర్యలు తీసుకోండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడికి అర్బన్ నాయకుల ఫిర్యాదు



వెంకటశివుడు యాదవ్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్‌లోని ఓ సీనియర్ నాయకుడు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో అలజడి రేపాలని చూస్తున్నారంటూ పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆ సీనియర్ నాయకుడు అవే సంస్థ ఆధ్వర్యంలో న్యాయ పోరాటమంటూ అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిపై కుట్రలు పన్నుతున్నారన్నారు. అవే ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ప్రెస్‌క్లబ్‌లో నగరంలో అన్యాయాలు, భూకబ్జాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. ప్రశాంతంగా ఉన్న అర్బన్ నియోజవర్గంలో అలజడి రేపడంతో పాటు ఎమ్మెల్యేపై బురద జల్లే రాజకీయ దురుద్దేశం ఉందని ఫిర్యాదు చేశారు. అవే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని టీడీపీ వ్యతిరేక కార్యక్రమంగా గుర్తించాలని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ నాయకులమని చెప్పుకునే కొందరు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. నాయకులు సరిపూటి రమణ, బుగ్గయ్యచౌదరి, రమేష్, మధు రాయల్, జోగి రాజేంద్ర, సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, చేపల హరి, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఓ వ్యక్తిని నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. 4వ పట్టణ సీఐ జగదీష్ మంగళవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7వ తేదీ బళ్లారి బైపాస్ సర్కిల్లో ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కురుగుంటకు చెందిన రంగరాజారెడ్డి మద్యం తాగి బైక్ నడపడంతో ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో రంగరాజారెడ్డి ట్రాఫిక్ పోలీసులతో గొడవపడి దాడి చేయడంతోపాటు వాళ్ల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. అలాగే అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు 14 రోజుల రిమాండ్‌కు పంపారు. అతడి బైక్‌ను సీజ్ చేశారు.

'చంద్రన్నతోనే నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి'



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శింగనమల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణుల సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ ఎం.ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఆయన పలువురు నాయీ బ్రాహ్మణులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 200 యూనిట్లకు పెంచుతూ జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఎన్నికల హామీని సీఎం నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయాల్లో పని చేసే నాయీబ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ బీసీసెల్ అధికారప్రతినిధి మల్లికార్జున, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ పార్లమెంట్ సభ్యులు ఎం.వెంకటప్ప, నరసింహులు, మునికుమార్, శింగనమల చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- కుంగిన బండలు... నెర్రెలు చీలిన గోడలు
- పాముల సంచారం
- భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



వెలుగు కార్యాలయంలో బాత్ రూంల వద్ద దుస్థితి, నెర్రెలు చీలిన గోడలు, తహసీల్దార్ కార్యాలయంలో శిథిలమైన ర్యాంప్

విడపనకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వెలుగు కార్యాలయం పరిస్థితి దారుణంగా ఉంది. ఈ కార్యాలయంలో బండలు ఎక్కడిక్కడ కుంగిపోయాయి. మీటింగ్ హాలు, అకౌంటెంట్ గది, కంప్యూటర్ గది, ఏపీఎం గది, బాత్ రూంలుల్లోని బండలు పూర్తిగా కుంగిపోయాయి. దీంతో పాములు కార్యాలయంలో తిరుగుతూ ఆ బండల కిందకు చేరుకుంటున్నాయి. ఒక బాత్‌రూం పూర్తిగా శిథిలమై అది పాములకే అన్నట్లు వదిలేశారు. బయటి పక్కన గోడలు కూడా పూర్తిగా నెర్రెలు వచ్చాయి. హౌసింగ్ కార్యాలయం కూడా పూర్తిగా శిథిలమైంది. దాదాపుగా 15 సంవత్సరాలు క్రితం సిమెంట్ తీర్లతో ఈ కార్యాలయాన్ని నిర్మించారు. కానీ బయట వైపు సిమెంట్ ప్లాస్టింగ్ చేయక పోవటంతో వర్షాలకు గది మొత్తం నెమ్మ పట్టి శిథిలమైంది. అక్కడక్కడా నెర్రెలు చీలి పాములు లోపలికి వస్తున్నాయి. నాలుగు రోజులు క్రితం కంప్యూటర్ ఆపరేటర్ టేబుల్ వద్ద పాము చేరుకోవడంతో.. వెలుగు కార్యాలయ అటెండర్‌ను పిలిపించి దాన్ని చంపేయించారు. పాముల భయంలో సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోల గది కూడా మొత్తం నెర్రెలు చీలింది. కార్యాలయం చిన్నది కావడంతో వీఆర్వోలకు ఇబ్బందిగా మారింది. ఈ భవనాలు ఎప్పుడు కూలుతాయోనని అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి.. కొత్త భవనాలను మంజూరు చేయించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

అంజన్నకు సిందూర అలంకారం



బొమ్మనహాళ్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి శ్రావణ మాసం మూడో మంగళవారం సందర్భంగా సింధూర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతల నుంచి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వినాయక ఆలయంలో హోమం



గుంతకల్లుటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):స్థానిక రైల్వే క్రీడామైదానం వద్ద ఉన్న శ్రీవినాయక ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి పురస్కరించుకుని గణేష్ హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణంలో అర్చకులు గణేష్, మహాలక్ష్మి, నవగ్రహ హోమాలను నిర్వహించారు. అలాగే పాతగుత్తిరోడ్డులోని వరసిద్ధి వినాయక దేవాలయంలో సంకష్ట చతుర్థి సందర్భంగా స్వామి వారికి పూజలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

బ్యాంక్‌లో మొరాయించిన సర్వర్

యల్లనూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంక్‌లో రెండు రోజుల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా సర్వర్ పనిచేయలేదు. రైతులకు సంబంధించిన రుణాల రెన్యువల్, ఇన్సురెన్స్ చెల్లింపు గడువు ఆగస్టు 15 కావడంతో ఖాతాదారులు బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భూముల కౌలుకు వేలం

తాడిపత్రి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి, శ్రీ చింతల వెంకటరమణస్వామి ఆలయాలకు సంబంధించిన భూముల కౌలుకు వేలంపాట నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. మండలంలోని వంగనూరు గ్రామంలో ఉన్న 4.52ఎకరాల భూమి ఏడాదికి రూ.10,500, యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామంలో ఉన్న 5.02 ఎకరాల భూమికి ఏడాదికి రూ.13,500 చొప్పున మూడేళ్ల కాలపరిమితికి పాట దక్కించుకున్నారని తెలిపారు. మూడేళ్లుగా బంజరుభూమిగా ఉండడంతో మూడేళ్ల కాలపరిమితితో వేలంపాట నిర్వహించినట్లు ఈఓ తెలిపారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుత్తి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్‌ను ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పట్టణంలో 2బీ బార్ల కోసం రాబోయే బార్ పాలసీ అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వారి వెంట ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్ఐ ఆస్లాంబేగ్, సిబ్బంది ఉన్నారు.

● గుంతకల్లుటౌన్: గుంతకల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పీ నాగమద్దయ్య తనిఖీ చేశారు. నాటు సారా తయారీ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నాటుసారా కేసులోని ముద్దాయిలను బైండోవర్ చేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ శివసాగర్, ఎస్ఐలు సుశీలమ్మ, వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ పట్టణ, మండల కమిటీని మంగళవారం ఎన్నిక చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, మండల అధ్యక్షుడిగా చిన్న, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, మహిళా పట్టణ అధ్యక్షురాలిగా తలారి శిరీష, ఉపాధ్యక్షురాలిగా మాసిపోగు సోని, ప్రధాన కార్యదర్శిగా జీఎస్ రామకృష్ణమ్మ, సహాయ కార్యదర్శిగా జయలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, జన్నేమస్తాన్, జయరాం, వన్నూరప్ప, అడవిరాముడు, వీరాంజనేయులు, గోవిందు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన



కణేకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మపురి శ్రీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. స్వామి వారి బృందావనానికి అర్చకుడు రాజగురురాజచార్యులు పూజలు జరిపించారు.

పంటల బీమాకు రేపే ఆఖరు

ఉరవకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంటల బీమా గడువు గురువారంలో ముగుస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని లత్తవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ప్రతి రైతు పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలని, అప్పుడే వాటికి ఇన్సురెన్సు, పంట నష్ట పరిహారం అందుతాయని అన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

పుట్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. తిమ్మాపురం నుంచి తక్కళ్లపల్లి వెళ్లే దారిలో వర్షానికి కల్వర్ట్ నాలుగు రోజుల క్రితం కుంగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్పందించిన అధికారులు మంగళవారం తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేయడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

దరఖాస్తుల స్వీకరణ

పెద్దపప్పూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని అశ్వర్థనారాయణస్వామి, చక్రస్థాపన భీమలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త స్థానానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25లోగా ఆలయ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

విద్యార్థికి అభినందన

రాయదుర్గంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం అంశంపై ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలో స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సీ ఓమేశ్వరీవాణి ద్వితీయ స్థానం సాధించింది. ఆ కళాశాలలో ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులకు అభినందన సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

ఉరవకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ నాయకులు వజ్రకరూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోనాలిసా, జగదీష్, ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు తక్షణమే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎన్‌వీ రాముడు, ప్రెసిడెంట్ అంజి, గ్యారేజ్ కార్యదర్శి జేఎస్ గౌడ్, నాయకులు శంకరయ్య, ప్రసాద్, రంగనాయకులు, ఉమామహేష్, మధు, రెహెమాన్ పాల్గొన్నారు.

● ఉరవకొండ : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఎన్ఎంయూ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ వెం టనే ఏర్పా టు చేయాలని, వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో డీఏలు ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు నారాయణస్వామి, ఓబులేశు, చలపతి, మనోజ్, వీరేష్ గౌడ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఇందులో ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి టీ ప్రతాప్ నారాయణ మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ఏ మల్లికార్జున, సెక్రెటరీ హెచ్ నటరాజ్, సభ్యులు రహంతుల్లా, వెంకటేశ్వర్లు, నరసింహులు, గ్యారేజ్ ప్రెసిడెంట్ ఖాజా, కార్యదర్శి రమణ, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● తాడిపత్రి : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. డిపో సెక్రటరీ కేజీఎన్ బాబు మాట్లాడుతూ.. గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. ధర్నాలో నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రెడ్డి, రామకృష్ణ, రంగయ్యతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు ఏపీ ఎస్టీఓ తాలూకా అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి తిప్పేస్వామి, జోనల్ సహాయ కార్యదర్శి ఎంఎండీ షఫీ, రీజనల్ నాయకులు పాల్గొన్నారు.



గుత్తి డిపో ధర్నా చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



బెళుగుప్పలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు దగ్గుబాటు సౌభాగ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వంద అడుగుల పొడవైనా జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు, శ్రీనివాస, సన్‌రైజర్ విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

● కూడేరు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండాను సర్పంచు లలితమ్మ ఎగురవేశారు. జాతీయ జెండా ప్రతి ఇంటా ఎగురువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏవో కేశవ, ఏపీఓ పోలేరయ్య పాల్గొన్నారు.

● కుందుర్పి : మండలంలోని కరిగానపల్లిలో జాతీయ జెండాను ఎంపీడీఓ లక్ష్మీ శంకర్, ఏపీవో మురళీధర్ టెక్నికల్ అసిస్టెంట్ రామాంజినేయులు, గ్రామస్థులు ఆవిష్కరించారు.

● కణేకల్లు : మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, నాయకులు హీరోజీరావు, అరుణమ్మ, సత్యనారాయణ, మాల్యం విజయ్‌కుమార్, మల్లయ్యచౌదరి పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ అమృత్ సర్వర్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.

ట్రాక్టర్లు ఇచ్చారు.. ట్రాలీలు మరిచారు

పల్లెల్లో సాగని చెత్త సేకరణ.. నిరుపయోగంగా వాహనాలు



హోతూరులో పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ట్రాక్టర్

ఉరవకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసినా, వాటికి ట్రాలీ లు ఇవ్వకపోవడంతో అవి నిరుపయోగంగా మారా యి. జిల్లాలో 577 పంచాయతీలు ఉండగా, 552 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. రోజూ ఇళ్ల నుంచి చెత్త సేకరణకు అద్దె ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. వీటి కి నెలకు రూ.10వేలు చెల్లించాల్సి రావడంతో చిన్న పంచాయతీలకు ఆర్థికంగా భారంగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి స్వర్ణాంధ్ర కార్పొరేషన్ నిధులతో ట్రాక్టర్లను విడతల వారిగా ప్రభుత్వం మంజూరు చేసిం ది. ఒక్కొక్క వాహనానికి రూ.6.01 లక్షలు చెల్లించింది. వాటికి ట్రాలీలు ఇవ్వకపోవడంతో ఆ ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉండిపోయాయి. కొన్ని నెలలుగా ట్రాక్టర్లు వినియోగించకపోవడంతో వాటిలోని బ్యాటరీలు దెబ్బతినే అవకాశముందని, గ్రామకార్యదర్శులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడును వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ట్రాక్టర్లు ట్రాలీ విషయంపై ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

యాడికి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసుకొనేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక సమావేశభవనంలో హౌసింగ్ సిబ్బంది, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో ఇల్లు మంజూరైనవారు ఇంటి నిర్మాణాలను కచ్చితంగా పూర్తిచేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వీరరాజు, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ శేషసాయి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం: సీపీఎం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప అన్నారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులు కొల్లగొడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, జగ్గలి రమేష్ పాల్గొన్నారు.

పిల్లర్ల రైల్వే బ్రిడ్జిలు నిర్మించండి

రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణకు విప్ కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాక్స్‌టైప్ కాకుండా రైల్వే వంతెలను పిల్లర్ టైప్‌లో నిర్మించాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆయన మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయదుర్గం-అనంతపురం, రాయదుర్గం-కణేకల్లు రోడ్డు మధ్యన ఆగిపోయిన రెండు రైల్వే బ్రిడ్జిల అంశాన్ని మంత్రికి వివరించారు. బాక్స్ టైప్ రైల్వే బ్రిడ్జిల నిర్మాణంతో ఈ ప్రాంతంలో చిన్న, వీధి వ్యాపారులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్తంభాలతో రైల్వేబ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. దీని వల్ల సర్వీస్ రోడ్ల కోసం భూసేకరణను కూడా సాధ్యమైనంత వరకు తగ్గించవచ్చన్నారు.



రంగనాథ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ముచ్చటగా మూడోసారి ఏకగ్రీవం

కుందుర్పి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కుందుర్పి టౌన్ కన్వీనర్‌గా సెల్లారి రంగనాథ్ ముచ్చటగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు, ఇన్‌చార్జి దేవినేని ధర్మతేజకు కృతజ్ఞతలు తెలిపారు. సెల్లారి రంగనాథ్‌ను కుందుర్పి గ్రామ టీడీపీ కుటుంబ సభ్యులు సన్మానించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం పలు ప్రాంతాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కళ్యాణదుర్గంలో కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఈ మాత్రలు వేశారు. అలాగే తాడిపత్రిలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేశారు. రాయదుర్గం మండలంలో 11,354 మంది విద్యార్థులకుగాను 9575 మందికి ఈ మాత్రలు పంపిణీ చేశామని వైద్యుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. యాడికి హైస్కూల్‌లో, కమలపాడు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీని సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి పరిశీలించారు. కూడేరు మండలంలో 8100 మందికిగాను 7950 మందికి మాత్రలు వేసినట్లు డాక్టర్ ఉషారాణి తెలిపారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుపమ కుందుర్పి ప్రభుత్వాస్పత్రిలో టీబీ ముక్త్ భారత్‌పై అవగాహన కల్పించారు. బ్రహ్మసముద్రం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను వైద్యాధికారి రాజేష్‌కుమార్ పంపిణీ చేశారు.



కళ్యాణదుర్గంలో మాత్రలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్

క్రైం న్యూస్..

యువకుడి అనుమానాస్పద మృతి



కైలాస్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండ లం శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన కైలాస్ (19) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఇతను రాయదుర్గం పట్టణంలో ఒక కిరాణాషాపులో పనిచేసేవాడు. తన స్నేహితుల బైక్‌లో రాయదుర్గం మండలం మల్లాపురం సమీపంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి శనివారం వెళ్లాడు. ఆ దేవాలయం వద్ద చెప్పులు, బైక్ వదిలేసి వెళ్లిపోయాడు. అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు దర్యాప్తు చేస్తుండగా కొండ ప్రాంతంలో కైలాస్ మృతదేహం ఉరికి వేలాడుతూ కనిపించింది. ఇతను ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఎవరైనా హత్య చేసి ఇలా ఉరికి వేలాడదీశారా.. అనేది తేలాల్సి ఉంది. కైలాస్ తాత ఓబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక చేనేతకాలనీలో నివాసముంటున్న పుల్లమ్మ వ్యవసాయ కూలీ. కూలి పనుల నిమిత్తం కండ్లగూడూరు గ్రామానికి వెళ్లిన ఆమె తిరిగి స్వగ్రామానికి ఆటోలో వస్తుండగా.. ఎదురుగా వచ్చిన మరో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ పుల్లమ్మను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

వరి రైతుకు యూరియా కష్టాలు

యల్లనూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల రైతులకు యూరియా కష్టాలు వచ్చి పడ్డాయి. సాధారణంగా అన్ని పంటలకు యూరియా అవసరం. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలకు ప్రాథమిక దశలో యూరియాను అధికంగా వాడతారు. యూరియా వాడకం వలన పంటలు నలుపు తిరిగి ఏపుగా పెరిగే అవకాశాలు ఉంటాయి. దీంతో యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. మే, జూన్ మాసాల్లో యూరియా నిల్వలు అన్ని ఎరువుల షాపుల్లో ఉండేవి. జూలైలో వరినాట్లు వేయడంతో యూరియా వాడకం అధికమైంది. ఆగస్టు వచ్చేసరికి మండలంలో ఎక్కడా యూరియా నిల్వలు లేవు. దీంతో యూరియా కోసం తాడిపత్రి, పులివెందుల, ముద్దనూరు తదితర ప్రాంతాలకు వెళ్లి అధిక రేట్లకు యూరియా కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. వ్యవసాయాధికారులు వెంటనే చర్యలు తీసుకొని మండలానికి యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనల మేరకే ఎంటీపీ కిట్స్ విక్రయించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లుటౌన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎంటీపీ (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) కిట్స్ విక్రయించడం, కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని ఆర్డీఓ ఏబీవీఎస్ శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాయలంలో మంగళవారం మెడికల్ స్టోర్ యాజమాన్యం, ఫార్మసిస్టులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంటీపీ కిట్స్ వినియోగం కేవలం అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణలో, సురక్షితమైన ఆసుపత్రులు, క్లినిక్స్‌లో మాత్రమే జరగాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఫార్మసీ లైసెన్సు రద్దు, జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, డ్రగ్ ఇన్స్పెక్టర్ కేశవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, తహసీల్దార్ రమాదేవి, సీఐ మనోహర్, పీపీ యూనిట్లు డాక్టర్ గంగాధర్, అరుణ, హరిత పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాడిపత్రి నియోజకవర్గం అంటే ఒక మంచి గుర్తింపు ఉందని, అలాంటి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధికి చేసి ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి రైతులు, యువకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల కోసం పెద్దవడుగూరు మండలం నుంచి పెద్దపప్పూరు మండలం వరకు సొంత నిధులతో కాలువలో పూడికను తీయించానన్నారు. ఇంకా మండలాల్లో ఎక్కడైనా సాగునీరు సంబంధించి ఇబ్బందులు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఐదు సంవత్సరాలు తాడిపత్రి నియోజకవర్గాన్ని వైసీపీ పాలకులు సర్వనాశనం చేశారని, దాన్ని బాగు చేయాలంటే ఇంకా సమయం పడుతుందని అన్నారు. ఇందులో వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం తనిఖీ

బొమ్మనహాళ్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరావు మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఏపీఓ లక్ష్మీకాంతబాయి, పంచాయతీ కార్యదర్శి శివన్న ఉన్నారు.